నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | సోమవారం 8 జూలై 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనకు ఎమ్మెల్యే హాజరు

పోచమ్మ ఆలయ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే కోవ లక్ష్మి

వాంకిడి, జూలై 7 : మండల కేంద్రంలోని రాంనగర్‌లో నిర్మించిన పోచమ్మ ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, తాజా మాజీ సర్పంచ్ బండే తుకారాం, తాజా మాజీ జడ్పీటీసీ అజయ్‌కుమార్, గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే అన్ని వర్గాల వారికి సంక్షేమ ఫలాలు అందినట్లు తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పీఏఎంసీ చైర్మన్ జాబోరే పెంటు, నాయకులు బోట్ పెల్లి జైరాం, సరస్వతి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

శాకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

మందమర్రిలో శాకాహార ర్యాలీ తీస్తున్న పీఎస్ఎస్ఎం సభ్యులు

మందమర్రి, జూలై 7: శాకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని పిరమిడ్ స్పిరిచ్యువల్ మూవ్ మెంట్ మందమర్రి(పీఎస్ఎస్ఎం) సభ్యులు కొంపెల్లి లతరమేశ్ అన్నారు. ఆదివారం మందమర్రి పట్టణంలో పీఎస్ఎస్ఎం ఆధ్వర్యంలో శాకాహార ర్యాలీ నిర్వహించారు. పాతబస్టాండ్ పెట్రోల్ బంక్ నుంచి రామన్‌కాలనీ, అంగడిబజార్, శాంతినగర్, విద్యానగర్‌ల మీదుగా సాగింది. వారు మాట్లాడుతూ ప్రజలు మాంసాహారాన్ని మాని ధ్యానంపై దృష్టి పెట్టాలన్నారు. మాంసాహారం వల్ల గుండెపోటులాంటివి వచ్చే ప్రమా దముందని హెచ్చరించారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం యోగాసనాలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షుడు భాస్కరరాజు నరేందర్ పాల్గొన్నారు.

ఆరోగ్య సర్వేకు సన్నద్ధం

అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ (ఫైల్)



- త్వరలో పల్లెల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు
- గ్రామాల వారీగా వైద్య శిబిరాలు
- ఇంటింటికీ వెళ్లి హెల్త్ వివరాల సేకరణ
- ప్రభుత్వానికి పూర్తి నివేదికలు అందించనున్న వైద్యారోగ్యశాఖ

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూలై 7 (నమస్తే తెలంగాణ) : వానకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో సర్వే నిర్వహించేందుకు వైద్య, ఆరోగ్యశాఖ సన్నద్ధమవుతున్నది. ఇంటింటా తిరిగి ప్రజల ఆరోగ్యంపై పూర్తిస్థాయి సమాచారం సేకరించనున్నది. దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారిని గుర్తించడంతో పాటు ప్రతి కుటుంబానికి సంబంధించిన ఆరోగ్య సమాచారాన్ని సేకరించనున్నది. ఏయే ప్రాంతాల్లో ఎలాంటి వ్యాధులు, జ్వరాలు వస్తున్నాయి. వాటి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనేదానిపై సర్కారుకు నివేదికలు అందించనున్నది. ఈ మేరకు శనివారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి వ్యాధుల నియంత్రణపై చర్చించిన విషయం విదితమే.

పల్లెల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు..

జిల్లాలోని 15 మండలాల్లో సీజనల్ వ్యాధులతో పాటు కిడ్నీ, కీళ్లు, కంటి సంబంధమైన వ్యాధులు, రక్తహీనతవంటివి వస్తున్నాయి. ముఖ్యంగా మారుమూల గిరిజన గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ఎక్కువగా వస్తుంటాయి. ఇక్కడి ప్రజలు అంతగా శ్రద్ధ చూపని కారణంగా అనేక వ్యాధులు ప్రబలుతుంటాయి. సీజనల్ వ్యాధులతో పాటు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారు ఎక్కువగానే ఉంటారు. ఈ నేపథ్యంలో పల్లెల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజల ఆరోగ్య విషయాలపై సమగ్ర సమాచారం సేకరించనున్నారు. దీనినిబట్టి ఆయా గ్రామాల్లో ప్రజల ఆరోగ్య పరిస్థితిపై ఒక అంచనా వేస్తారు. ఆయా ప్రాంతాల్లో తరచుగా వస్తున్న రోగాలకు చేయాల్సిన చికిత్సలతో పాటు అవి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. పిల్లలకున్న వ్యాధులను సైతం గుర్తించి సమాచారం సేకరించనున్నారు. ఈ సర్వే ఆధారంగా ఏయే ప్రాంతాల్లో ఎలాంటి రోగాలు వస్తునాయి..? వీటి నివారణ కోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలనే విషయాలపై నివేదికలు తయారు చేయనున్నారు. ఈ ప్రత్యేక సర్వేల్లో స్థానికంగా పనిచేసే ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీలతో పాటు పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని వినియోగించుకోనున్నారు. ఏయే విషయాలను గమనించి నమోదు చేసుకోవాలనే విషయాలపై సిబ్బందికి అవగాహన కల్పించనున్నారు.

పాసు పుస్తకాలను చూపిస్తున్న రైతులు

ఫారెస్టోళ్లు అరిగోస పెడుతున్రు

- సాగు చేయవద్దని అడ్డుకుంటున్నరు
- పట్టాలున్నా పట్టించుకుంటలేరు
- కేసులు పెడుతామని వేధిస్తున్నరు
- గిట్లయితే మేం బతికేదెట్లా..?
- ఆస్నాద్ రైతుల ఆవేదన
- సర్కారు న్యాయం చేయాలని వేడుకోలు

చెన్నూర్ రూరల్, జూలై 7 : 'మా భూములకు పట్టాలున్నయి. గివ్విటిమీద రైతుబంధు, లోన్లు కూడా తీసుకున్నం. ఏండ్లకేండ్లుగా గీ భూములనే నమ్ముకొని బతుకుతున్నం. గిప్పుడు ఫారెస్టోళ్లు వచ్చి సాగు చేయద్దని అరిగోస పెడుతున్రు. కేసులు పెడుతామని భయపెడుతున్రు. గిట్లయితే మా జీవితాలెట్లా?.' అంటూ చెన్నూర్ మండలం ఆస్నాద్ గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆస్నాద్ గ్రామ శివారులోని సర్వే నంబర్లు 582, 730లలో 785 ఎకరాల భూమి ఉండగా, 1971 నుంచి ఈ భూముల్లో వ్యవసాయం చేస్తున్నట్లు ఇక్కడి రైతులు చెబుతున్నారు. ఇందులో సుమారు 400 ఎకరాలకు 230మంది రైతులు పట్టాలు కలిగి ఉన్నారు. 80ఎకరాల్లో రైతులు ఖాస్తుకు ఉన్నారు. ఈ భూములపైనే రైతుబంధుతో పాటు బ్యాంకుల్లో రుణాలు కూడా పొందారు. తాతల కాలం నుంచి పట్టాలున్నా అధికారులు తమను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెబుతున్నారు. ఐదేళ్ల నుంచి అధికారులతో రైతులు పోరాటాలు చేస్తూనే ఉన్నారు. 2018లో కూడా అప్పటి ప్రభు త్వం కొం దరి రైతులుకు పట్టా పుస్తకాలు అందజేసింది.

గతంలో సర్వే చేపట్టిన అధికారులు

2015లో ఇవి అటవీశాఖకు చెందిన భూములని, హైకోర్టు స్టే ఇచ్చిందని, ఈ భూముల్లో వ్యవసాయం చేయవద్దంటూ ఫారెస్టు అధికారులు రైతులకు నోటీసులు అందజేశారు. అయితే, గతంలో ప్రభుత్వం లావణి పట్టా కింద తమకు పాసు పుస్తకాలు ఇచ్చిందని, తమకు న్యాయం చేయాలని అప్పటి కలెక్టర్‌కు రైతులు ఫిర్యాదు చేశారు. విచారణ నిమిత్తం పలు శాఖల అధికారులు స్వయంగా వెళ్లి వివాదాస్పద భూములను పరిశీలించారు. సాగు భూములు, రైతులు వేసుకున్న బోర్లు, సమీపంలో చెరువు, రెవన్యూ మ్యాప్, ఫారెస్ట్ మ్యాప్‌లను పరిశీలించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి సమస్యలు రాలేదు. మళ్లీ 2019 లో ఆ భూముల్లో వ్యవసాయం చేయవద్దు అని అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారు. మళ్లీ అప్పటి ఎమ్మెల్యే, విప్ బాల్క సుమన్, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని కలిసి రైతులు తమ గోడు వెల్లబోసుకున్నారు. వారి చొరవతో ఇప్పటి వరకు వివాదం సద్దుమణిగింది. గత పదిహేను రోజులుగా మళ్లీ అటవీశాఖ అధికారులు వేధింపులకు గురి చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల రైతులంతా కలిసి మంచిర్యాల కలెక్టర్, చెన్నూర్ ఎఫ్‌డీవోకు వినతి పత్రాలు అందజేశారు. తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

పాత రికార్డులు పరిశీలిస్తాం

ఆస్నాద్ గ్రామ శివారులో ఏయే సర్వే నంబర్లలో ఎవరికి పట్టాలు ఉన్నాయో పరిశీలిస్తాం. రికార్డులు, రెవెన్యూ మ్యాప్, ఫారెస్ట్ మ్యాప్‌లను చూడాల్సి ఉంది. ఫారెస్ట్ శాఖ అధికారులు జాయింట్ సర్వే కోసం అప్పీలు చేస్తే మేము కూడా సిద్ధమే. రెవెన్యూ, అటవీశాఖ అధికారులు కలిసి జాయింట్ సర్వే చేపట్టి రైతులకు న్యాయం జరిగేలా చూస్తాం.

- మల్లికార్జున్, తహసీల్దార్, చెన్నూర్.

తాతల కాలం నుంచి సాగు చేస్తున్నం

ఆస్నాద్ శివారులోగల సర్వే నంబర్ 582లోని భూముల్లో తాతల కాలం నుంచి సాగుచేసుకుంటున్నం. నిత్యం అధికారులు మమ్ముల గోస పెడుతున్నరు. ఇవి అటవీశాఖ భూములని, ఇక్కడ సాగు చేస్తే కేసులు పెడుతం అంటున్నరు. మాకు పట్టా పాసు పుస్తకాలు కూడా ఉన్నాయి. గీ భూముల మీద లోన్లు కూడా తీసుకున్నం. సర్కారోళ్లే మాకు న్యాయం చేయాలి.

- గజ్జెల రామాగౌడ్, రైతు, ఆస్నాద్

జాయింట్ సర్వే చేసి న్యాయం చేయాలె

మా ఊరి శివారులోని భూములకు పట్టాలున్నయి. ఎన్నో ఏండ్ల సంది ఎవుసం చేసుకుంటున్నం. పదేళ్లుగా ఫారెస్టోళ్లు మమ్ముల భయపెడుతున్నరు. పట్టాలున్నా ఫలితం లేకుంటైతంది. అటవీశాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు జాయింట్ సర్వే చేసి మాకు న్యాయం చేయాలె.

- ఇంగిలి లింగయ్య, రైతు, ఆస్నాద్

పోచమ్మ తల్లి విగ్రహం ధ్వంసం

ధ్వంసమైన పోచమ్మ తల్లి విగ్రహం

మందమర్రి, జూలై 7 : మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రగుంటపల్లి గ్రామ సమీపంలోగల ఊరు పోచమ్మ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు విగ్రహాన్ని ధ్వంసం చేశారు. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి పోచమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేయడంతో పాటు వస్తువులను చిందరవందర చేశారు. అదేరోజు ఉదయం ఓ మతి స్థిమితం లేని మహిళ ఆలయ ప్రాంగణాన్ని నీటితో శుద్ధి చేసిందని, విగ్రహం ధ్వంసం చేయడం ఆమె వల్ల కాదని గ్రామస్తులు చెబుతున్నారు. రాత్రి సమయాల్లో కొందరు గుప్త నిధుల కోసం సంచరిస్తున్నారని, ఇది వారి పనే అయ్యి ఉంటుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఆదివారం ఉదయం గ్రామ ప్రజలు ఆలయం వద్దకు చేరుకొని ధ్వంసమైన పోచమ్మ విగ్రహాన్ని పరిశీలించారు.

భీం విగ్రహానికి జడ్జి నివాళి

భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జిల్లా సివిల్ జడ్జి అనంతలక్ష్మి

కెరమెరి, జూలై 7 : మండలంలోని జోడెఘాట్ గ్రామాన్ని జిల్లా సివిల్ జడ్జి అనంత లక్ష్మి ఆదివారం సందర్శించారు. ఆదివాసీ పోరాట యోధుడు భీం విగ్రహానికి ఆమె నివాళులర్పించారు. అనంతం మ్యూజియాన్ని పరిశీలించారు. గిరిజన సంస్కృతీ సంప్రదాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆదివాసీలు ఆమెను ఘనంగా సన్మానించారు. ఇక్కడ కుమ్రం భీం ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పెందోర్ రాజేశ్వర్, ఎస్ఐ విజయ్ ఉన్నారు.

బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలి

సమావేశంలో మాట్లాడుతున్న టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

- కార్మిక సంఘాల డిమాండ్
- మందమర్రిలో రౌండ్‌టేబుల్ సమావేశం

మందమర్రి, జూలై 7 : తెలంగాణలోని నూతన గనులను వేలం వేయకుండా సింగరేణికే కేటాయించాలని పలు కార్మిక సంఘాల నాయకులు, సీనియర్ జర్నలిస్టులు డిమాండ్ చేశారు. ఆదివారం మందమర్రి పట్టణంలోని సింగరేణి సీఈఆర్ క్లబ్‌లో రెవల్యూషన్ భగత్ సింగ్ యూత్ ఆధ్వర్యంలో తెలంగాణలోని బొగ్గు గనుల వేలాన్ని నిరసిస్తూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సింగరేణి సంస్థ ఎక్స్‌ప్లోరేషన్ ద్వారా తెలంగాణలోని బొగ్గు నిల్వలను గుర్తించిందని, కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనులను వేలం వేసి, అందులో సింగరేణి కూడా పాల్గొని దక్కించుకోవాలనడం సరికాదన్నారు. 135 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర, అపార అనుభవమున్న సింగరేణి సంస్థకే గనులను కేటాయించేలా కేంద్రపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరముందన్నారు. నూతన గనులను ఇతర సంస్థలకు అప్పగిస్తే సహించేది లేదని వారు హెచ్చరించారు. అన్ని కార్మిక సంఘాలు ఏకతాటిపైకి వచ్చి గనుల వేలానికి నిరసనగా పోరాటాలు చేయాల్సిన అవరసముందని వారు తెలిపారు. సింగరేణికి నూతన గనులు రాకుంటే సంస్థలో ఉద్యోగుల సంఖ్య తగ్గుతుందని, తద్వారా సంస్థ మనుగడకే ముప్పువాటిల్లే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. గనుల వేలానికి వ్యతిరేకంగా యూనియన్‌లు చేపట్టే ఆందోళనలకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలపాలని కోరారు. ఈ సమావేశంలో టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఓ.రాజశేఖర్, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, హెచ్ఎంఎస్ నాయకులు నాగరాజు గోపాల్, దుర్గం మల్లేశ్, ఎండీ. జాఫర్, జైపాల్‌సింగ్, జే.శ్రీనివాస్, మహేందర్, సీనియర్ జర్నలిస్టులు ఎండీ. మునీర్, పరందాంకుమార్, హెచ్.రవీందర్, రెవల్యూషన్ యూత్ అధ్యక్షుడు అనిల్ భగత్, అక్బర్, రాజశేఖర్, శ్రీనాథ్, కృష్ణ, జాఫర్, దీపక్, రమాకాంత్, ప్రణయ్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

వేదికపై ఒకటైన పూర్వ విద్యార్థులు

లక్షెట్టిపేట, జూలై 7: పట్టణంలోని కేఎస్ఆర్ ఫంక్షన్ హాలులో ఆదివారం స్థానిక జేబీఎస్ పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 1991లో ఏడో తరగతి చదివిన విద్యార్థులంతా ఒకే వేదికపైకి కలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మిత్రులు గుత్తికొండ శ్రీధర్, శ్రీరాముల శ్రీకాంత్, విజయ్, అరుణ్, మల్లేశ్, కుమార్, ముంతాజ్, సతీశ్, సత్యనారాయణ, 50మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కోటపల్లి మండలం పారుపల్లి-లింగన్నపేట గ్రామాల మధ్య నిర్మించిన కల్వర్టు వద్ద దిగబడ్డ లారీ

ఎదుల్లబంధం గ్రామ సమీపంలోని తుంతుంగా చెరువు వద్ద ప్రమాదకరంగా రోడ్డు

రోడ్లు ఇలా.. వెళ్లేదెలా..?

కోటపల్లి, జూలై 7 : మండలంలోని పారుపల్లి–ఎదుల్లబంధం రోడ్డు అధ్వానంగా మారగా, రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. వర్షాలకు బురదమయమై వాహనాలు కదల్లేని పరిస్థితి నెలకొన్నది. ఇక పారుపల్లి–లింగన్నపేట గ్రామాల మధ్య కల్వర్టు నిర్మిస్తుండగా, ఇంకా పనులు పూర్తి కాలేదు. పక్కన తాత్కాలిక రోడ్డు వేయగా, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అది బురదమయంగా మారింది. వాహనాలు దిగబడిపోయి ప్రయాణికులు అష్టకష్టాలు పడాల్సి వస్తున్నది. ఎదుల్లబంధం గ్రామ సమీపంలోని తుంతుంగా చెరువు వద్ద కూడా రోడ్డు కోతకు గురైంది. భారీ వర్షాలు పడితే రోడ్డు ధ్వంసమై 10 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయే అవకాశముంది. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్లను వేగంగా బాగు చేస్తారో.. లేక పట్టనట్లు వ్యవహరిస్తారో వేచి చూడాలి మరి.

• జన్మదిన శుభాకాంక్షలు
• పొలిటికల్
• స్వదేశాగమనం
• లీగల్ ప్రకటనలు
• క్లాసిఫైడ్స్
• పదవీ విరమణ
• ప్రారంభోత్సవం
• శ్రద్ధాంజలి
• సినిమా
• వివాహ మహోత్సవం
• షష్టిపూర్తి మహోత్సవం
మరియు
• అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679